క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీల వితరణ


ప్లాస్టిక్ కుర్చీలు అందజేస్తున్న నాయకులు

మాడ్గుల: మండలంలోని కోలుకులపల్లి గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి సోమవారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు జంగయ్య, భాగ్యమ్మ దంపతులు సమకూర్చిన ప్లాస్టిక్ కుర్చీలను మాజీ సర్పంచ్ అనురాధ అందజేశారు. కేంద్రంలో చిన్నారుల కోసం ప్లాస్టిక్ కుర్చీలను అందించిన దంపతులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సత్యమ్మ, భాగ్యమ్మ, ప్రమీల, మహాలక్ష్మి గ్రామస్తులు సాయి, తేజ, శివాని పాల్గొన్నారు.

ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం


ప్రారంభోత్సవంలో పాల్గొన్న చైర్‌పర్సన్

తుర్కయంజాల్: ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ కోరారు. సోమవారం మున్సిపాలిటీ పరిధి తుర్కయంజాల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని ఆమె సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆధార్ కేంద్రాలు లేకపోవడం వల్ల ఇటీవల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కొత్తకుర్మ మంగమ్మ, పుల్లగుర్రం కీర్తన, గుండా భాగ్యమ్మ, నాయకులు విజయానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైకి సత్కారం


ఎస్సైని సన్మానిస్తున్న నాయకులు

తలకొండపల్లి: తలకొండపల్లి మండలానికి నూతన ఎస్సైగా శ్రీకాంత్ ఇటీవల నియమితులయ్యారు. ఆయనను సోమవారం మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ లలితాజ్యోతయ్య ఆధ్వర్యంలో నాయకులు శాలువాలతో పోలీస్ స్టేషన్‌లో సన్మానించారు. కార్యక్రమంలో మల్లేశ్, ఈశ్వర్, రవి, దశరథం, వెంకటయ్య, జంగయ్య, యాదయ్య, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రేషన్ షాపు ప్రారంభం


రేషన్‌షాపును ప్రారంభించిన నారాయణ

ఆమనగల్లు: రేషన్ షాపుల ద్వారా ప్రజలకు అందించే సరుకులను సకాలంలో పంపిణీ చేయాలని ఆమనగల్లు మండల రైతు సమన్వయ సమితీ కన్వీనర్ నిట్టె నారాయణ కోరారు. మండలంలోని ఆకుతోటపల్లి పరిధిలోని గౌరారం గ్రామంలో రేషన్‌షాపు డీలర్‌గా ప్రభుత్వం ఇటీవల శివానిని నియమించింది. గ్రామంలో రేషన్‌షాపును తహసీల్దార్ లలిత, ఎంపీడీఓ ఫారుక్‌హుస్సేన్‌లతో కలిసి ఆయన సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఇబ్బందులు లేకుండా సరుకులను పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతయ్యగౌడ్, ప్రసాద్, శివ తదితరులు పాల్గొన్నారు.

మంచాల సీఐకి సన్మానం


సీఐ బబ్యానాయక్‌తో నాయకులు

మంచాల: మంచాల పోలీస్‌స్టేషన్‌కు సీఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన బబ్యానాయక్‌ను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సోమవారం కలిసి సన్మానించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌నాయక్, లచ్చిరాంనాయక్, పాండునాయక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆధార్.. జనం బేజార్!

- సెంటర్ లేక అవస్థలు
- పట్టించుకోని అధికారులు

ఆధార్ సెంటర్ లేక పోవడంతో మాడ్గుల మండలవాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గత్యంతరం లేక సుదూర ప్రాంతాలకు వెళ్లి ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులు చేసుకుంటున్నారు. పాలకులు, అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకున్న దాఖలాలు లేవు.


ఆధార్ కార్డు కోసం ఫొటో దిగుతున్న మహిళ (ఫైల్)

మాడ్గుల: ప్రభుత్వ పథకాలు పొందాలన్నా ఇతర గుర్తింపు పత్రాలు తీసుకోవాలన్నా ప్రస్తుతం ఆధార్ కార్డు తప్పనిసరి. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆరు గ్యారంటీ పథకాల దరఖాస్తుల స్వీకరణకు సైతం ఆధార్ కార్డే కీలకం. మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేయాలన్న ఆధార్‌ను చూయించాలి. ఇంతటి ప్రాధాన్యం సంతరించుకున్న ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులు చేసుకోవాలన్నా, కొత్తది తీసుకోవాలన్నా మాడ్గుల మండలవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫోన్ నంబర్ లింక్ చేయడానికి సుదూర ప్రాంతాలకు వెళుతున్నారు. స్థానికంగా ఆధార్ సెంటర్ లేక పోవడంతో దాదాపు 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇబ్రహీంపట్నం లేదా నాగర్ కర్నూలు జిల్లా వెల్దండ మండల కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. దీంతో ఆధార్ సెంటర్‌కు వెళ్లడానికి సమయంతో పాటు ప్రయాణ ఖర్చులు భారంగా అవుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్ర వాహనాలపై వెళ్లేటప్పుడు ప్రమాదాలు సైతం సంభవించిన ఘటనలు చాలానే ఉన్నాయి.

గతంలోనే వినతులు

మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయలని పలువురు ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. ఆధార్ సెంటర్ లేక ఇబ్బందులు పడుతున్నామని మాడ్గులలో సెంటర్ ఏర్పాటు చేసి ఇబ్బందులు తీర్చాలని గతంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచులు కోరారు. అంతే కాకుండా సెంటర్ ఏర్పాటు చేయాలని జిల్లా ఉన్నతాధికారులకు సైతం విన్నవించారు. అయినా నిమ్మకు నీరెత్తినట్లు అధికార యంత్రాంగం వ్యవహరిస్తోంది. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


మాడ్గుల మండల పరిషత్ కార్యాలయం

ఇబ్బందులు పడుతున్నాం



మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం అందించే ప్రతి పథకానికి ఆధార్ కార్డును లింకు చేస్తున్నారు. దీంతో ఆధార్ కార్డులో మార్పులు చేయించాలంటే ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. -సంతోష, నల్లవారిపల్లి

కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి



మండలంలో ఆధార్ సెంటర్‌ను వెంటనే ఏర్పాటు చేయాలి. సెంటర్ లేక పోవడంతో మాడ్గుల మండల ప్రజలు ఆధార్‌లో మార్పులు చేయించాలంటే ఇబ్రహీంపట్నం, వెల్దండ మండల కేంద్రాలకు వెళుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలి. - సమీర్, ఇర్విన్

సమ్మె నోటీస్ అందజేత


తలకొండపల్లి: ఆఫీసర్‌కు నోటీసు ఇస్తూ..


యాచారం: సమ్మె నోటీసు ఇస్తున్న సిబ్బంది

తలకొండపల్లి: దేశవ్యాప్తంగా ఈ నెల 16న నిర్వహించనున్న సమ్మెను విజయవంతం చేయాలని ప్రజాసంఘాల నాయకుడు జిల్లెల పెంటయ్య కోరారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా వివిధ రంగాల ఉద్యోగ సంఘాలు, కార్మికులు, కర్షకులు, ఆశావర్కర్లు సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని సోమవారం ఆయన పిలుపునిచ్చారు. పెంటయ్య ఆధ్వర్యంలో ఆశాకార్యకర్తలు మండల కేంద్రంలో ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి స్నేహకు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆశా కార్యకర్తలకు కనీసం వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తలను పర్మినెంట్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కోమటి, నిర్మల, కవిత, నర్సమ్మ, పద్మ, శిరిష, యాదాబాయి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన సిబ్బంది నోటీసు

యాచారం: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 16న తలపెట్టిన గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని మధ్యాహ్న భోజన సిబ్బంది కోరింది. ఈ మేరకు సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మండల విద్యా వనరుల కేంద్రంలో సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కర్షక, కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం చట్టాలను తెస్తుందన్నారు. గ్రామీణ బంద్‌ను విజయవంతం చేద్దామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ చందునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో తాఖీదులు

ఆమనగల్లు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజాకార్మిక రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఆశాకార్యకర్తలు కోరారు. పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో వైద్యాధికారి డా.పరిక్షిత్ నరేందర్‌ను ఆశా కార్యకర్తలు కలిసి సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలు మాట్లాడుతూ ఆశా కార్యకర్తలను రెగ్యులర్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కార్యకర్తలు బీబీ షేక్, సల్మ, మంజుల, అనిత, నిర్మల, అలివేలు, విజయ, నయీమా, అమృత, రోహిని, చంద్రకళ, వసంత, లక్ష్మమ్మ, సీఐటీయూ నాయకులు శివశంకర్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.


ఆమనగల్లు: డా.నరేందర్‌కు సమ్మె నోటీసు అందిస్తున్న ఆశా కార్యకర్తలు

పాలమూరు యాత్రలో కాంగ్రెస్ నేతలు

ఆమనగల్లు: పాలమూరు ప్రగతి కోసం సీడబ్ల్యూసీ ప్రత్యేకాహ్వానితుడు, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి చేపట్టిన పాలమూరు న్యాయయాత్రలో ఆమనగల్లు, కడ్తాల మండలాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఆరు రోజుల క్రితం చల్లా వంశీచంద్‌రెడ్డి మహబూబ్‌నగర్ పార్లమెంటు నియోజక వర్గంలోని మక్తల్ నుంచి పాదయాత్ర ప్రారంభించారు. సోమవారం నారాయణపేట అసెంబ్లీ నియోజక వర్గ పరిధిలోని దామరగిద్ద మండలంలో యాత్ర సాగింది. ఇందులో పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడురి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, జహంగీర్‌బాబా, వెంకటేశ్, లక్ష్మయ్య, బిక్యానాయక్, హీరాసింగ్‌నాయక్, తులసీరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.


వంశీచంద్‌రెడ్డితో కలిసి నడుస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎమ్మెల్యే పర్ణికారెడ్డికి సత్కారం

ఆమనగల్లు: నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డిని ఆమనగల్లు, కడ్తాల మండలాల కాంగ్రెస్ నాయకులు ఘనంగా సత్కరించారు. నారాయణపేట అసెంబ్లీ నియోజక వర్గ పరిధిలోని దామరగిద్ద మండల కేంద్రంలో సోమవారం పాలమూరు న్యాయ యాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డిలను పీసీసీ సభ్యులు అయిల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, బిక్యానాయక్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

'వేదిక్ మ్యాథ్స్'లో విద్యార్థుల ప్రతిభ

ఆమనగల్లు: ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలో నిర్వహించిన వేదిక్ మ్యాథ్స్, అబాకస్ పోటీలలో ఆమనగల్లు పట్టణంలోని లిటిల్ స్కాలర్స్ టెక్నో స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుచుకున్నారు. వేదిక్ మ్యాథ్స్‌లో 7వ తరగతి విద్యార్థి ఐశ్వర్యరెడ్డి ప్రథమ బహుమతి, అబాకస్ పోటీలలో జూనియర్ లెవెల్‌లో మూడో తరగతి విద్యార్థి స్నేహలత, రెండో తరగతి విద్యార్థి లక్ష్మీప్రియలు ప్రథమ, ద్వితీయ బహుమతులు సొంతం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో స్కూల్ ఆవరణలో సోమవారం విద్యార్థులను చైర్మన్ చుక్క అల్లాజీగౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చుక్క అల్లాజీగౌడ్ మాట్లాడుతూ.. పోటీలలో పాల్గొనడం ద్వారా విద్యార్థులలో సామర్థ్యం పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ జిల్లెల సుజాతారెడ్డి, డైరెక్టర్ సావిత్రి, అడ్వైజర్ సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్వేత, హైమావతి, రాధిక, గీత, స్వాతి, శ్రీజన్య, మమత, తేజ, నందిని, చలం, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులను సత్కరించిన చైర్మన్ అల్లాజీగౌడ్

భూ బాధితుల ప్రదక్షిణలు!

- ప్రజావాణిలో సమస్యలపై ఫిర్యాదుల వెల్లువ
- త్వరితగతిన పరిష్కరించాలని మొర

ఇబ్రహీంపట్నం రూరల్: ధరణి సమస్యలకు మోక్షమెప్పుడని భూ బాధితులు కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం మారిన పాలన తీరు మారలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజావాణికి వచ్చిపోయే వారు విసిగిపోతున్నారు. మొన్నటి వరకు ఎన్నికలతో ఇబ్బందులు పడ్డారు. రాబోయే రోజుల్లో సైతం పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ రానుంది. వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తారు. పాలకులే మారుతున్నారు తప్ప ప్రజల బతుకులు మారడం లేదని ఆవేదన వెలిబుచ్చుతున్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో సమస్యలు తీర్చాలని మొర పెట్టుకుంటున్నారు.


ప్రజావాణిలో ఫిర్యాదుల ఇస్తున్న ప్రజలు

భూమిని నమోదు చేయాలి



ధరణి వచ్చినప్పటి నుంచి నేటి వరకు మా భూమి ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. యాచారం మండలం నందివనపర్తి గ్రామంలో సర్వే నంబరు 336లో మాకు ఆరు ఎకరాల భూమి ఉంది. అనేక సార్లు తిరిగినా అధికారుల్లో స్పందన లేదు. మా భూమి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. - గోవింద్, నందివనపర్తి

భూమి మాయమైంది



మాది ఇబ్రహీంపట్నం మండల కేంద్రం. మాకు సర్వే నంబరు 906లో 2 గుంటల భూమి ఉంది. నాకు ప్రస్తుతం 90 ఏళ్లు. 30–40 ఏళ్ల నుంచి సాగు చేస్తున్న భూమిని గుంట మాయం చేశారు. ధరణి వచ్చినప్పటి నుంచి సమస్య తీరడం లేదు. - కొంద్రు సత్తమ్మ, ఇబ్రహీంపట్నం

ప్రత్యామ్నాయం చూడాలి



గత ప్రభుత్వం హయాంలో తీసుకొచ్చిన ధరణి అందరినీ దగా చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సమస్యలు తీరుతాయని అనుకున్నాం. కానీ ధరణిని నిలిపివేశారు. క్లియర్‌గా ఉన్న భూములకు పనులు చేయాలి. మూడేళ్లుగా తిరుగుతున్న ఫలితం లేకుండా పోతోంది. - ఇందిరాల రమేశ్, ఇబ్రహీంపట్నం

డబ్బులివ్వకుంటే రిజెక్టు చేశారు



మంచాల మండలం నోములలో సర్వే నంబరు 381లో రెండు ఎకరాల పొలానికి సంబంధించి టీఎం 33లో దరఖాస్తు చేశాను. ధరణిలో ఉన్నా అధికారులకు లంచం ఇవ్వకుంటే రిజెక్టు చేశారు. 2022లో దరఖాస్తు చేసుకున్నా. - లక్ష్మీనర్సింహ, నోముల

ఫైల్ మాయం చేశారు



కందుకూరు మండలం తిమ్మాపూర్‌లో సర్వే నంబరు 500, 331కి సంబంధించిన 35 ఎకరాల పొలం హైకోర్టులో కేసు ఉంది. ఇంప్లిమెంట్ చేయమని అధికారులను ఆదేశించారు. ట్రిబ్యూనల్‌లో జరిగిన కేసు కాగితాలను మాయం చేశారు.- నరేందర్‌రెడ్డి, తిమ్మాపూర్

ప్రభుత్వ భూమి కబ్జా



మంచాల మండలం ఆగాపల్లిలో సర్వే నంబరు 191, 187లో ప్రభుత్వ భూమి ఉంది. రియల్టర్లు నాలుగు ఎకరాల భూమి కబ్జా చేశారు. రాత్రికి రాత్రే రోడ్డు వేశారు. అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదు. - లక్ష్మణ్, ఆగాపల్లి


డిజిటల్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న నరేందర్‌గౌడ్ తదితరులు

డిజిటల్ పుస్తకాలతో విద్యార్థులకు మేలు

- ఐక్యత ఫౌండేషన్ క్రియాశీల సభ్యుడు నరేందర్‌గౌడ్

తలకొండపల్లి: స్కాన్ అండ్ లర్న్ డిజిటల్ కంటెంట్ పాఠ్య పుస్తకాలతో విద్యార్థులకు పలు ప్రయోజనాలున్నాయని ఐక్యత ఫౌండేషన్ క్రియాశీలక కార్యవర్గ సభ్యుడు నరేందర్‌గౌడ్ అన్నారు. వాటితో అర్థంకాని విషయాలను అర్థమయ్యేంత వరకు చదువుకునే వెసులుబాటు ఉంటుందని ఆయన తెలిపారు. ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సహకారంతో మండల పరిధిలోని వెల్జాల్, ఖానాపూర్, రాంపూర్, పడకల్, చంద్రధన, చుక్కాపూర్, తలకొండపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సోమవారం డిజిటల్ కంటెంట్ పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. గణితం, ఫిజిక్స్, బయాలజీ, సోషల్ పుస్తకాలను ఒక్కో విద్యార్థికి నాలుగు చొప్పున 300 మంది విద్యార్థులకు మొత్తం 1,200 పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా నరేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు మంచి ర్యాంక్‌లు సాధించాలనే ఉద్దేశంతో డిజిటల్ పుస్తకాలు పంపిణీ చేశామన్నారు. డిజిటల్ ప్రపంచాన్ని దృష్టిలో పెట్టుకొని స్కాన్ అండ్ లర్న్ డిజిటల్ కంటెంట్ పుస్తకాలను రూపొందించామన్నారు. ప్రస్తుత టెక్నాలజీని అనుసరించి పాఠ్య పుస్తకాలలో పాఠ్యాంశాలను లెసన్స్‌గా విభజించి ఒక్కో లెసన్స్‌కు ఒక క్యూఆర్ కోడ్‌ను రూపొందించారు. అక్కడ ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడంతో వీడియో రూపంలో పాఠాలు వినవచ్చు అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, ఫౌండేషన్ సభ్యులు తిరుపతిగౌడ్, మల్లయ్య, మల్లేశ్, మహేశ్, శివ, విజయ్, కల్యాణ్, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

తలకొండపల్లి: మండల పరిధిలోని దేవుని పడకల్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం పండితుల మంత్రోచ్చరణాల నడుమ వేద పారాయణ పఠనం నిర్వహించారు. ఆలయంలో అభిషేకం, హారతి కర్పూర నీరాజనం, శ్రీ వేంకటేశ్వర నామ సంకీర్తనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ శ్రీకాంత్, ఏఎస్‌ఐ సీతారాంరెడ్డిలు ఆలయానికి విచ్చేసి స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకుడు పద్మనాభం, మాజీ సర్పంచ్ శ్రీశైలం, భిక్షపతి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

• స్పెషల్ ఆఫీసర్‌ను కలిసిన నేతలు

ఇబ్రహీంపట్నం: దండుమైలారం స్పెషల్ ఆఫీసర్‌గా నియమితులైన స్థానిక తహసీల్దార్ అన్వర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో జనార్దన్‌రావు, నరేష్‌గౌడ్, జంగయ్య, యాదగిరి, అవినాష్ పాల్గొన్నారు.

• మహనీయుల చిత్రపటాల అందజేత

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలోని విద్యా కార్యాలయానికి, రాయపోల్ ప్రభుత్వ పాఠశాలకు 68813 టీమ్ ఆధ్వర్యంలో సోమవారం దేశ జాతీయ నాయకుల చిత్రపటాలను అందజేశారు. కార్యక్రమంలో ఆ టీమ్ కోఆర్డినేటర్ పరమేశ్, రాజు, చంద్రశేఖర్, ఆనంద్, మహేశ్, ప్రధానోపాధ్యాయులు మహేశ్, చంద్రశేఖర్‌లు పాల్గొన్నారు.

పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేద్దాం

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లచ్చిరెడ్డి

మంచాల: గ్రామాల్లో బీజేపీ బలమైన శక్తిగా తయారు చేద్దామని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోగిరెడ్డి లచ్చిరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మండల ఇన్‌చార్జి పాండాల జంగయ్యగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు అమలు చేస్తూ.. బడుగులకు అండగా ఉంటుందన్నారు. డిజిటలైజేషన్ విధానంతో నేడు అవినీతికి తావులేకుండా దేశం ముందుకు పోతోందన్నారు. ఇతర దేశాల పౌరులు ఇక్కడ చదువుకునేందుకు, ఉద్యోగాల కోసం వచ్చేలా కేంద్రం చర్యలు తీసుకుంటోందన్నారు. త్వరలో ×గావ్ ఛలో అభియాన్‡ పేరుతో బీజేపీ రథయాత్ర నిర్వహించి అయోధ్య రామ మందిర యాత్రకు సంబంధించిన కార్యక్రమాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దన్నె భాషయ్య, నాయకులు శ్రీశైలం, రాజేందర్‌రెడ్డి, రాజుగౌడ్, శివరాల పాండు, నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, భిక్షపతి, రాంచంద్రి, వెంకటేశ్, విజయ్, శ్రీశైలం, మహేందర్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న లచ్చిరెడ్డి